

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



సోమవారం 26-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :128 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

బాబాయ్ నగలు కొట్టి.. థార్ కొనేశాడు!



బాబాయ్ ఇంట్లో 15 తులాల నగల చోరీ

నగలు అమ్మి థార్ కొనుగోలు

రూ.10 లక్షలకు బంగారం విక్రయం

వాహన పూజకు బాబాయ్‌కు ఆహ్వానం

నగలు కనిపించక పోలీసులకు ఫిర్యాదు

యువకుడితో పాటు స్వర్ణకారుడి అరెస్ట్

హైదరాబాద్‌లో అన్‌లిమిటెడ్ బస్ జర్నీ!

రూ.600కే వీక్లీ బస్ పాస్

ఏడు రోజులు అన్‌లిమిటెడ్ ప్రయాణం

ఏసీ బస్సుల్లోనూ పాస్ చెల్లుబాటు

పుష్పక్ సర్వీసులకు మినహాయింపు

బస్ పాస్ కౌంటర్లలో అందుబాటు

ప్రయాణికులకు ఖర్చు తగ్గింపు

పర్యాటకులకు ఎంతో ప్రయోజనం

ప్రజా రవాణాకు ప్రోత్సాహం



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బస్ ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) తీపికబురు అందించింది. రాజధాని నగరంలో ప్రయాణాన్ని మరింత సులభతరం, బడ్జెట్ ఫ్రెండ్లీగా మార్చేందుకు సరికొత్త ఆఫర్‌కు శ్రీకారం చుట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం రూ.600లకే అన్‌లిమిటెడ్ 'వీక్లీ బస్ పాస్' పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

బీఆర్ఎస్‌పై దానం నాగేందర్ ఫైర్!

మేడిగడ్డ పర్యటన జాలీ ట్రిప్

ఎల్‌నినోపై అనవసర రాజకీయం

హైదరాబాద్‌కు అదనంగా 5 టీఎంసీల నీరు

రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిక

బీజేపీపై ఓట్ల తొలగింపు ఆరోపణలు

కాంగ్రెస్ ర్యాలీకి దానం పిలుపు

రాజకీయ స్వార్థంతోనే విమర్శలు

2 లో

తెలంగాణ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి!

సర్వర్‌ను హ్యాక్ చేసిన కేటుగాళ్లు

ఎన్‌క్రిప్ట్ అయిన డేటాబేస్

నిలిచిపోయిన అప్లికేషన్ సేవలు

సర్వర్‌లో రాన్సమ్ నోట్

రంగంలోకి తెలంగాణ సైబర్ బ్యూరో

ఐటీ చట్టం కింద కేసు నమోదు

పునరుద్ధరణకు అధికారుల ప్రయత్నాలు



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ ప్రభుత్వానికి చెందిన గవర్నమెంట్ టు బిజినెస్ సేవల్ని అందించే టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి చోటుచేసుకుంది. పోర్టల్ సర్వర్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు... దాని డేటాబేస్‌ను కూడా ఎన్‌క్రిప్ట్ చేశారు. అక్టోబరు 22న రాత్రి 11.36 గంటలకు సైబర్ దాడి జరగడంతో పోర్టల్ అప్లికేషన్ నిలిచిపోయింది. దీనిని సరిచేయడానికి టెక్నికల్ టీమ్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. సర్వర్ రీస్టార్ట్ చేయడానికి క్లౌడ్4సీ సంస్థ సహకారం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం జరిపిన పరిశీలనలో ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు.ఆ సర్వర్ పునరుద్ధరణకు క్లౌడ్4సీ సంస్థను కోరినా కుదరలేదు. ఈ క్రమంలోనే సర్వర్ హ్యాక్ అయినట్లు నిర్ధారణకు వచ్చారు.

రాహుల్ వ్యంగ్యాస్త్రాలు.. బీజేపీకి ధన్యవాదాలు!

ర్యాలీ ప్రచారంపై వ్యంగ్యాస్త్రాలు

నవంబర్ 1న ఇండియా కూటమి ర్యాలీ

ఓట్ల తొలగింపుపై నిరసన

ఎన్నికల సంఘంపై ఆరోపణలు

ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపు

విద్యార్థులు, రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి

'ఓటు మీదే.. పోరాటం మీదే'

2 లో

డ్రగ్స్ ముఠాపై కేంద్రం ఉక్కుపాదం!

మూడు రాష్ట్రాల్లో 38 చోట్ల సోదాలు

రూ.100 కోట్ల హవాలా గుట్టురట్టు

1,424 బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

రూ.17.82 కోట్ల ఆస్తులు జప్తు

18 మంది నిందితుల అరెస్ట్

డెత్ ట్రయాంగిల్ కారిడార్‌పై దెబ్బ

2029 నాటికి డ్రగ్స్ నెట్‌వర్క్‌ల నిర్మూలన

2 లో

నీరు వృథా చేస్తే రూ.5 వేల ఫైన్!



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాకాలంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీంతో అక్టోబర్ నెలలోనే నీటి కొరత సమస్య మొదలైంది. ఇక వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రబీలో వరి సాగు చేయొద్దని.. విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

గులాబీ గూటిలో గుబులు!



- ట్రబుల్ షూటర్‌కు షాక్!
- ఎన్నికల బాధ్యతల్లో నో ఛాన్స్!
- హరీశ్‌కు ఎందుకీ దూరం?
- కేటీఆర్ కనుసన్నల్లోనే అంతా!
- అభ్యర్థుల ఎంపికలోనూ నో ఎంట్రీ!
- గెలుపు క్రెడిట్ దక్కకూడదనా?
- మూడో పవర్ సెంటర్ భయమా?
- గులాబీ పార్టీలో అంతర్గత కలకలం!

న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): బీఆర్ఎస్ పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరున్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతలు ఎందుకు అప్పగించలేదు? ఆయన ప్రమేయం లేకుండానే ఎన్నికలు నిర్వహించాలని ప్లాన్ చేశారా? ఒకవేళ బాధ్యతలు అప్పగిస్తే పార్టీలో హరీశ్‌కు మరింత పట్టు పెరుగుతుందని భయంతోనే దూరంగా పెట్టారా? అనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతున్నది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించింది. వారందరినీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ నేరుగా పర్యవేక్షణ చేస్తారు. మరి అత్యంత కీలకమైన నేతగా ఉన్న హరీశ్ రావు పాత్ర ఇందులో లేకపోవడం సరికాదని డిస్కషన్ జరుగుతున్నది.

మిగతాది 2 లో..

తెలంగాణలో బియ్యం 'రాబందులు'



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ఓవైపు రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు వస్తున్నప్పటికీ, మార్కెట్‌లో మాత్రం బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొందరు వ్యాపారులు, మిల్లు యజమానులు అక్రమ సిండికేట్‌గా మారి సృష్టించిన కృత్రిమ కొరత వల్ల సన్న బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. గత 3 నెలల వ్యవధిలోనే బియ్యం ధరలు ఏకంగా 30 నుంచి 40 శాతానికి పైగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది.

గతంలో రీజనబుల్ ధరలకు లభించిన సన్నబియ్యం రకాలైన సోనా మసూరి, బీపీటీ ప్రస్తుతం నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు.

ఏపీకి తుపాను ముప్పు.. ఐఎండీ అలర్ట్!



సోమవారం తుపానుగా మార్పు

మంగళవారానికి తీవ్ర తుపాను

తుపానుకు 'అర్నాబ్' పేరు

మూడు రోజులు భారీ వర్షాలు

గంటకు 125 కి.మీ. వేగంతో గాలులు

మత్స్యకారులకు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

ఏపీకి రూ.10,047 కోట్ల రైల్వే ప్రాజెక్టులు!

కేంద్ర మంత్రులతో చంద్రబాబు కీలక భేటీ

ఏపీకి ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో మద్దతు

తొమ్మిది పోర్టులకు రైల్వే కనెక్టివిటీ

అమరావతి, విశాఖలో కోచింగ్ టెర్మినళ్లు

నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ప్రతిపాదనలు

విశాఖ--తిరుపతి మధ్య మరో రైలు

బెంగళూరుకు వందేభారత్ స్లీపర్ రైలు



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో వేర్వేరుగా కీలక సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్ డిజైన్ మరియు తయారీ రంగానికి అవసరమైన అధునాతన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీఎం కోరారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 26-10-2026

బీఆర్ఎస్‌పై దానం నాగేందర్ ఫైర్!



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): విపక్ష బీఆర్ఎస్ వైఖరిపై, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై హైదరాబాద్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయ స్వార్థంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు ఇటీవల చేపట్టిన మేడిగడ్డ పర్యటన కేవలం ఒక 'జాలీ ట్రిప్' మాత్రమేనని దానం నాగేందర్ అభివర్ణించారు. వాతావరణంలో ఏర్పడుతున్న ఎల్‌నినో ప్రభావంపై కావాలనే అనవసర రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని నాగేందర్ స్పష్టం చేశారు. 2027 జనవరి నాటికి హైదరాబాద్ మహా నగరానికి అదనంగా మరో 5 టీఎంసీల నీరు అవసరమవుతుందని అంచనా వేశారు. భవిష్యత్తు అవసరాలు, మహానగర ప్రయోజనాల గురించి ఆలోచించకుండా ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు.

బీజేపీపై ఆరోపణలు..

బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ (యూపీ) రాష్ట్రాలలో ఓట్లను అక్రమంగా తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని సంచలన ఆరోపణలు చేశారు. నవంబర్ 1వ తేదీన ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

డ్రగ్స్ ముఠాపై కేంద్రం ఉక్కుపాదం!



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాలపై కేంద్ర ప్రభుత్వం సైలెంట్ ఆపరేషన్‌తో ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ ట్రైడెంట్ విజయంపై ప్రకటన చేశారు. అస్సాం, మిజోరం, మణిపూర్ రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో నిర్వహించిన ఈ స్పెషల్ అండర్ కవర్ ఆపరేషన్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది.

బయటపడిన హవాలా నెట్‌వర్క్..

ఈ ఇంటర్నేషనల్ డ్రగ్ ట్రాఫికింగ్‌లో ఏకంగా రూ.100 కోట్ల హవాలా లావాదేవీల వ్యవహారం వెలుగుచూసింది. హ్యాండ్‌లింగ్‌లో ఉన్న 1,424 బ్యాంక్ ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. అంతేకాకుండా రూ.17.82 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. అదేవిధంగా తనిఖీల్లో 500 డిటోనేటర్లు, రూ.12 లక్షల లిక్విడ్ క్యాష్‌ను నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న 18 మంది నిందితులను అరెస్టు చేసినట్లుగా అధికారులు వెల్లడించారు.

'డెత్ ట్రయాంగిల్' కారిడార్‌పై దెబ్బ

'ఆపరేషన్ ట్రైడెంట్'పై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రియాక్ట్ అయ్యారు. భారత్, మైన్మార్, బంగ్లాదేశ్‌ల గుండా సాగుతున్న డెత్ ట్రయాంగిల్ కారిడార్ ద్వారా మాదకద్రవ్యాల రవాణా జరుగుతోందని తెలిపారు. కేంద్ర ఏజెన్సీలు, అస్సాం, మిజోరం, మణిపూర్ పోలీస్ బలగాలు సంయుక్తంగా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేశాయని ప్రశంసించారు. మోడీ ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని, 2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో ప్రతీ డ్రగ్ నెట్‌వర్క్‌ను పూర్తిగా తుడిచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నామని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 2047 నాటికి 'వికసిత భారత్' సాధనలో భాగంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో బియ్యం 'రాబందులు'

మొదటి పేజీ తరువాయి

నన్న బియ్యం ధరల పెరుగుదల పట్టిక (అక్టోబర్ 2026 నాటికి)

బియ్యం రకం / కేటగిరీ	గత నెల (సెప్టెంబర్ 2026) సగటు ధర	ప్రస్తుత ధర (అక్టోబర్ 2026)	పెరిగిన సగటు మార్జిన్
సాధారణ మధ్యం (కిలో)	₹61.60	₹65.00 నుండి ₹90.00	కిలోపై ₹10 నుండి ₹25 వరకు
సూపర్ ఫైన్ రకం (కిలో)	₹75.00	₹85.00 నుండి ₹100.00	కిలోపై ₹20 నుండి ₹25 వరకు
బై (శాంపిల్ రకం (క్వింటాలు)	₹5,600	₹8,400 నుండి ₹9,200	క్వింటాల్‌పై ₹2,800 నుండి ₹3,600
26 కిలోల బస్తా (MMT / BPT)	₹1,500 – ₹1,650	₹1,900 – ₹2,100	బస్తాపై ₹400 నుండి ₹450 వరకు
సోనా రకం (కొనాలోసేల్ క్వింటాలు)	₹2,068 (గత ఎనాసి)	₹3,419	ఏడాది వ్యవధిలో 65.4% పెరుగుదల

సగటు కుటుంబానికి నెలకు బియ్యం కొనుగోలు వ్యయం భారీగా పెరగడంతో బడ్జెట్ తలకిందులవుతోంది. భవిష్యత్తులో బియ్యానికి డిమాండ్ పెరిగి కొరత ఏర్పడుతుందనే అంచనాలతో వ్యాపారుల ముసుగులో ఉన్న కొందరు అక్రమార్కులు ముందుగానే భారీ స్థాయిలో నిల్వలు పెంచేశారు. తాజాగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతంల్లో ఉన్న ప్రైవేటు గోదాముల్లో లక్షల టన్నుల బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, నిల్వలు ఎంత ఉన్నాయి.. ఎంత విక్రయిస్తున్నారు? అనే వివరాలను స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయకుండా ప్రభుత్వ నియమ నిబంధనలను బహిరంగంగానే తుంగలో తొక్కేస్తున్నారు.

ధరల పట్టికలు లేకుండా విక్రయాలు

హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లోని బియ్యం షాపులు, హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లు తమ దుకాణాల వద్ద నిబంధనల ప్రకారం ధరల పట్టికలు ప్రదర్శించకుండానే ఇష్టారాజ్యంగా రేట్లు చెప్పి విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో వ్యాపారులు అడిగినంత చెల్లించుకోవాల్సిన పరిస్థితి వినియోగదారులకు దాపురించింది.

రైతుల జేబు ఖాళీ.. వ్యాపారుల జేబులు ఫుల్లు

రాష్ట్రంలో బియ్యం ధరలు విపరీతంగా పెరిగినా ఆ ప్రయోజనం ధాన్యం పండించిన అన్నదాతలకు మాత్రం దక్కడం లేదు. దళారులు, వ్యాపారులు తక్కువ ధరకే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి, ఇప్పుడు బియ్యం రూపంలో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. సామాన్యులపై పడుతున్న ఈ అదనపు భారాన్ని అరికట్టడానికి పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిల్వ గోదాములపై దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో అన్‌లిమిటెడ్ బస్ జర్నీ!

మొదటి పేజీ తరువాయి

7 రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం..



ఈ సరికొత్త వీక్లీ బస్ పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా 7 రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఏసీ బస్సులతో సహా అన్ని రకాల సిటీ బస్సుల్లోనూ ప్రయాణికులు ఈ పాస్‌తో అపరిమితంగా ప్రయాణించవచ్చు. కేవలం పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని టీజీఎస్ ఆర్టీసీ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న రోజువారీ, నెలవారీ పాసులకు అదనంగా ప్రయాణికులకు అనుకూలమైన ప్రయాణ ఎంపికను అందించడానికి టీజీఎస్ ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార పనుల నిమిత్తం, సందర్శన కోసం హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులకు నగరం పరిధిలో వారం రోజుల పాటు నిరంతరం ప్రయాణించే వారికి ఇది ఎంతో లాభదాయకంగా ఉంటుంది.

బస్ పాస్ కౌంటర్లలో వీక్లీ బస్‌పాస్‌లు..

అయితే, ఈ వీక్లీ పాసులు హైదరాబాద్ నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి. అవసరమైన వారు తమ సమీపంలోని బస్ పాస్ కౌంటర్లకు వెళ్లి ఈ పాస్‌ను కొనుగోలు చేయవచ్చని యాజమాన్యం ప్రకటించింది. ప్రజా రవాణా వ్యవస్థ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడమే కాకుండా, నగర ప్రయాణికులకు అందుబాటు ధరలలో మెరుగైన ప్రయాణ సేవలు అందించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. నగరంలో వారం రోజుల పాటు ప్రయాణించే వారందరూ రూ.600 వీక్లీ బస్ పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీకి రూ.10,047 కోట్ల రైల్వే ప్రాజెక్టులు!

మొదటి పేజీ తరువాయి

అలాగే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. సుమారు రూ. 10,047 కోట్ల అంచనా వ్యయంతో కూడిన నాలుగు ప్రధాన రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచిన చంద్రబాబు.. రాష్ట్రంలోని 9 ప్రధాన ఓడరేవులను రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే (పోర్ట్ కనెక్టివిటీ) కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

రాజధాని అమరావతి, విశాఖపట్నం లో భారీ కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణం చేపట్టడం తో పాటు, అమరావతిలో రైల్వే పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే ప్రాజెక్టుల వారీగా చూస్తే.. కొవ్వూరు-భద్రాచలం ప్రాజెక్టుకు రూ. 2,860 కోట్లు, అనకాపల్లి-కొత్తవలస బైపాస్‌కు రూ. 2,190 కోట్లు, విజయవాడ బైపాస్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 3,197 కోట్లు, ఒంగోలు-దొనకొండ రైల్వే ప్రాజెక్టుకు రూ. 1,800 కోట్లు కేటాయించి పనులను వేగవంతం చేయాలని సీఎం ప్రతిపాదించారు. విజయవాడ బైపాస్‌లో రెండు కొత్త రైల్వే వంతెనల నిర్మాణంతో పాటు, విజయవాడ-ఇటార్సీ, ఖరగ్‌పూర్-విజయవాడ మార్గాల మధ్య 4-లైన్ల సామర్థ్యం పెంపు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-తిరుపతి మధ్య మరో రైలును, అలాగే విశాఖ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు వందేభారత్ స్లీపర్ రైలును నడపాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

రాహుల్ వ్యంగ్యాస్త్రాలు.. బీజేపీకి ధన్యవాదాలు!



న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): రాజధాని ఢిల్లీలో నవంబర్ 1న 'ఇండీ' కూటమి ర్యాలీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధికార బీజేపీని లక్ష్యంగా చేసుకుని ట్విట్టర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాము తలపెట్టిన ర్యాలీని అధికార పార్టీ అత్యంత ఉత్సాహంగా ప్రచారం చేస్తోందంటూ ఎద్దేవా చేస్తూ ఆయన 'హృదయపూర్వక ధన్యవాదాలు' తెలిపారు.

భారీ ప్రచారం కల్పిస్తున్నారంటూ ఎద్దేవా..

ఓట్ల తొలగింపు, ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్నికల సంఘం అవకతవకలకు వ్యతిరేకంగా నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి భారీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీ గురించిన సమాచారం దేశవ్యాప్తంగా ప్రజలందరికీ చేరువయ్యేలా బీజేపీ, దాని మిత్రపక్షాలు విపరీతంగా ప్రచారం చేస్తున్నాయని, అందుకే ఆ పార్టీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని రాహుల్ గాంధీ సెటైర్లు వేశారు. దేశంలో ఓట్లు అన్యాయంగా తొలగిపోతున్నాయని, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఇకపై మూగబోయి సహించేది లేదని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు, రాజ్యాంగంపై నమ్మకమున్న విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపార వర్గాలన్నీ ఈ నిరసనలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఓటు మీదే.. ఈ పోరాటం కూడా మీదే' అని పేర్కొంటూ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు.

బాబాయ్ నగలు కొట్టి.. థార్ కొనేశాడు!

న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): ఒక యువకుడు తన బాబాయ్ ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగిలించాడు. వాటిని అమ్మి థార్ వాహనం కొనుగోలు చేశాడు. వాహనం పూజ కోసం బాబాయ్‌ను కూడా అతడు ఆహ్వానించాడు. బంగారు నగలు మాయంపై ఆయన ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సతావే గ్రామానికి చెందిన 19 ఏళ్ల సమర్ చవాన్, తన ఇంటి సమీపంలో నివసించే బాబాయ్ ఉమేష్ మారుతి చవాన్ ఇంట్లో నెల రోజుల కిందట 15 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. స్థానిక స్వర్ణకారుడైన సంగ్రామ్ బాబాసో మోరే సహాయంతో రూ.10 లక్షలకు వాటిని అమ్మాడు. ఆ డబ్బుతో కొత్త మహీంద్రా థార్‌ను అతడు కొనుగోలు చేశాడు.

కాగా, కొత్త వాహనాన్ని ఇంటికి తెచ్చిన తర్వాత పూజకు రావాలని బాబాయ్ ఉమేష్ చవాన్‌ను సమర్ ఆహ్వానించాడు. ఆ కార్యక్రమం కోసం నగలు ధరించాలని భావించిన ఉమేష్‌కు అవి కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గ్రహించాడు. అయితే ఉమేష్ అమ్మమ్మకు చెందిన నగలు పక్కనే ఉన్నప్పటికీ వాటిని ఎవరూ తాకలేదు. కేవలం ఉమేష్, అతడి భార్యకు చెందిన నగలు మాత్రమే మాయమయ్యాయి. దీంతో కుటుంబానికి చెందిన వ్యక్తే ఆ బంగారు నగలు చోరీ చేసినట్లు ఆయన అనుమానించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరోవైపు పోలీసులు సమర్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆ యువకుడు అకస్మాత్తుగా కొత్త కారు కొనుగోలు చేయడానికి అవసరమైన డబ్బును ఎలా సమకూర్చాడు అన్న దానిపై దర్యాప్తు చేశారు. కీలక ఆధారాలు లభించడంతో సమర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించారు. తానే దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అతడితో పాటు బంగారు వ్యాపారి సంగ్రామ్ మోరేను కూడా అరెస్ట్ చేశారు. ఆ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

ఏపీకి తుపాను ముప్పు.. ఐఎండీ అలర్ట్!

న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రవాయుగుండంగా బలపడినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఆదివారం మధ్యాహ్నానికి తీవ్రవాయుగుండం విశాఖపట్నానికి 870 కిలోమీటర్లు, కాకినాడకు 960 కిలోమీటర్లు, బాపట్లకు 1130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. తీవ్రవాయుగుండం నైరుతి దిశగా కదులుతూ సోమవారం ఉదయానికి తుపానుగా, మంగళవారానికి తీవ్ర తుపానుగా మారనుంది. తీవ్ర వాయుగుండంగా తుపానుగా రూపాంతరం చెందిన అనంతరం దానికి.. బంగ్లాదేశ్ సూచించిన అర్నాబ్ అనే పేరును పెట్టనున్నారు. కాగా.. ఈ తుపాను ప్రభావం ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలపై ఉంటుందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించింది. తుపాను ప్రభావంతో మంగళవారం నుంచి మూడ్రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, తీరందాటే సమయంలో 115-125 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. తుపాను నేపథ్యంలో మత్స్యకారులు వారంరోజుల వరకూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని భారత వాతావరణ సంస్థ హెచ్చరించింది.

తెలంగాణ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి!

మొదటి పేజీ తరువాయి

అయితే, మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన గుర్తుతెలియని రాస్పమ్‌నోట్ సర్వర్‌లో కనిపించింది. ఈ-మెయిల్ అడ్రస్‌కు సైబర్ నేరగాళ్లు సర్వర్‌కు పంపించారు. దీంతో టీజీ-ఐపాస్ అప్లికేషన్, డేటాబేస్ సేవలు నిలిచిపోయాయి. డేటాను తొలగించకపోవడాన్ని బట్టి సైబర్ దాడిగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి ఫిర్యాదు చేశారు. డేటా బయటికి వెళ్లిందేమో పరిశీలించాలని, డేటాబేస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరణకు సహకరించాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరోని కోరారు. టీజీ-ఐపాస్ సేవలు పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సోమవారం నాటికి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దర్యాప్తును ప్రారంభించింది. పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సంగా సురేష్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా టీజీసీఎస్బి కేసు నమోదు చేసింది. ఫిర్యాదు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం జి2బి సేవలను అందించే టీజీ-ఐపాస్ పోర్టల్ అక్టోబర్ 22 రాత్రి 11.36 గంటల ప్రాంతంలో పనిచేయడం ఆగిపోయింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులకు అత్యంత కీలకమైన ఈ ప్లాట్‌ఫారమ్‌పై జరిగిన దాడిపై టీజీసీఎస్బి ఐటీ చట్టంలోని సెక్షన్ 43, 66 కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. సెక్షన్ 43 కంప్యూటర్ వ్యవస్థలకు జరిగే నష్టానికి జరిమానా, పరిహారాన్ని సూచించగా.. సెక్షన్ 66 సైబర్ నేరాలను తెలియజేస్తుంది.

నీరు వృథా చేస్తే రూ.5 వేల ఫైన్!

మొదటి పేజీ తరువాయి

ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా సెలబ్రెటీలతోనూ ప్రచారం నిర్వహించనున్నారు.

భాగ్యనగరంలో డిసెంబర్ నుంచి నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉందని జలమండలి ఇప్పటికే హెచ్చరించింది. నగరానికి తాగు నీటిని సరఫరా చేసే సింగూరు, మంజీరా రిజర్వాయర్లలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు 735 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అవసరం కాగా.. జలమండలి 585 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా చేయగలగుతోంది. దీంతో చాలా ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని సూచించింది. ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నప్పటికీ.. కొందరు మాత్రం నీటి వృథా మానడం లేదు. దీంతో కార్లు కడగటం లాంటి పనులతో నీళ్లు వేస్ట్ చేసే వారిపై భారీ జరిమానాలకు నగరపాలక సంస్థలు, జలమండలి సిద్ధం అవుతున్నాయి.

రాష్ట్ర జలమండలి సూచనల నేపథ్యంలో నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. వాటర్ ట్యాంకర్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. నీటి పొదుపు కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో అక్టోబర్ నెలలోనే వేసవి స్థాయిలో రోజుకు 7 వేల వాటర్ ట్యాంకుల బుకింగ్స్ జరుగుతున్నాయి. దీంతో ప్రయివేట్ ట్యాంకర్ల దందా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి ట్యాంకర్ల నీటి లీకేజీల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రవాణా చేసే సమయంలో నీరు వృథాగా పోతే.. ట్యాంకర్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. ఇది తొలిసారి మాత్రమే, జరిమానా విధించిన తర్వాత కూడా ట్యాంకర్ నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గమనిస్తే.. ఏకంగా ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రకటించారు. దీంతో మూతలు బిగించకుండా నీటిని మోసుకెళ్లే ట్యాంకర్లకు ఇక నుంచి తిప్పలు తప్పవు.

నీటిని వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా విధించాలనే నిర్ణయం హైదరాబాద్, వరంగల్ నగరాలకే పరిమితం కాలేదు. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు సైతం తాగు నీటిని వృథా చేసే వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామని తొలిసారి 2024లో ప్రకటించింది. ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్లు గమనిస్తే 1916కు ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. 2024 నుంచి బెంగళూరులో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

గులాబీ గూటిలో గుబులు!

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి లేకుండానే సమీక్షలు, నియామకాలు..

'ఖమ్మం-నల్గొండ-వరంగల్', మహబూబ్ నగర్-రంగారెడ్డి-హైదరాబాద్' గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల పరిధిలో 77 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఇందులో మెజార్టీ నియోజకవర్గాల్లో హరీశ్ రావుకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. ఉద్యమ సమయంలో ఆయన ఆయా అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో నేరుగా పర్యటించారు. దీంతో అక్కడ ఉన్న అడ్వొకేట్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, యువత, ఉద్యోగులతో పరిచయాలు ఉన్నాయి. వారిని కలిసినప్పుడు కొందరిని పేరుతో పిలుస్తుండగా, మరికొందరిని ముఖం చూసి గుర్తుపట్టి పలకరిస్తుంటారు. అందుకే హరీశ్‌ను ఏదైనా ఒక గ్రాడ్యుయేట్ స్థానానికి ఎన్నికల కో ఆర్డినేటర్‌గా నియమిస్తే పార్టీ అభ్యర్థుల గెలుపునకు ఉపయోగపడుతుందనే చర్చ కేడర్‌లో మొదలైంది. ఓ వైపు కేటీఆర్, మరోవైపు హరీశ్ జిల్లాల్లో పర్యటిస్తే పార్టీ కేడర్‌లో కూడా కొత్త ఉత్సాహం వస్తుందని ఆశిస్తున్నారు. నిజానికి గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రక్రియలో హరీశ్ పాత్ర తక్కువగా ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. షెడ్యూల్ వచ్చిన తర్వాత తెలంగాణ భవన్‌లో జరిగిన మొదటి సమావేశంలో మాత్రమే కేటీఆర్‌తో పాటు హరీశ్ పాల్గొన్నారు. ఆ తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో ఆయన కనిపించారు. కానీ పార్టీ ఆఫీసులో జరిగిన కీలకమైన ఎన్నికల సమీక్షా సమావేశానికి ఆయన హాజరుకాలేదు. అదే రోజు ఆయన లేకుండానే అసెంబ్లీ ఇన్‌చార్జిల జాబితా ప్రకటించారు.

అభ్యర్థుల ఎంపికలో దూరం..

గ్రాడ్యుయేట్ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో హరీశ్ రావు పాత్ర లేదని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటివరకు అధికారికంగా ఏ నియోజకవర్గానికి అభ్యర్థిని ప్రకటించలేదు. కానీ 'నల్గొండ-ఖమ్మం-వరంగల్' స్థానంలో రాకేశ్ రెడ్డి పేరు ఖరారు కావడంతో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. జిల్లా నేతలను కలిసి ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రాకేశ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేయడాన్ని బీఆర్ఎస్‌లోని కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అభ్యంతర పెడుతున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయాన్ని కొందరు హరీశ్ వద్ద ప్రస్తావించేందుకు సిద్ధమైతే, ఆయన సన్నిహితులు గ్రహించి ఆ అంశంపై మాట్లాడొద్దని సూచించినట్టు సమాచారం. ఆ తర్వాత బయటికి వచ్చిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అభ్యర్థుల ఎంపికలో హరీశ్ రావుకు ప్రమేయం లేదా? అని డిస్కషన్ చేసినట్టు తెలిసింది.

-ూశ్రీంశీ =ఖుఎ - హైదరాబాద్‌కు చేరిన మంచిర్యాల కాంగ్రెస్ వర్గ పోరు

గెలుపులో భాగస్వామ్యం ఉండొద్దనా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఈ రెండు ఎన్నికల్లో హరీశ్ రావు, కేటీఆర్ ఇద్దరూ కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కానీ ఆ రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. సిట్టింగ్ స్థానాల్లో బావబామ్మర్దులు కలిసి పనిచేసినా కాపాడుకోలేదని చర్చ జరిగింది. కాగా, రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో బీఆర్ఎస్‌కు విజయావకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి సమయంలో హరీశ్‌కు బాధ్యతలు అప్పగిస్తే విజయంలో ఆయన పాత్ర కూడా ఉందని సంకేతాలు కేడర్‌లో వెళ్తాయి. అలాంటి క్రెడిట్‌ను హరీశ్‌కు రావొద్దనే ఉద్దేశ్యంతోనే ఆయన భాగస్వామ్యం లేకుండా చేశారని టాక్ వినిపిస్తున్నది.

పాగా వేస్తారని భయమా..

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో హరీశ్‌కు భాగస్వామ్యం కల్పిస్తే ఆయన క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తూనే పరోక్షంగా తన బలాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. పార్టీలో మూడో పవర్ సెంటర్ ఏర్పడే ప్రమాదాన్ని కేసీఆర్ ముందే ఊహించి, ఈ ఎన్నికల్లో బాధ్య

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 26-10-2026

స్థానిక ఎన్నికల్లో సీపీఐ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- గిరిజనుల సమస్యలు గాలికి
- ఎన్నికల వేళే పాలకులకు గుర్తుకొస్తారా?
- ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపు



ఇది కద నిజం, కుక్కునూరు: గిరిజనుల సమస్యలు గాలికి వదిలేసి, ఎన్నికల వేళే పాలకులకు వారు గుర్తుకొస్తారా? అంటూ సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాలు, పాలకుల తీరుపై విమర్శలు గుప్పించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కుక్కునూరు మండలంలో సీపీఐ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజల పక్షాన నిలిచే సీపీఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కుక్కునూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం శాఖా కార్యదర్శి వరసా పాపారావు అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ, మండలంలో సీపీఐకి ప్రజాదరణ ఉన్న ప్రతి ప్రాంతంలో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ, అలుపెరగని పోరాటాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పార్టీ సీపీఐ మాత్రమేనని పేర్కొన్నారు.

మారుతున్న పాలకులు.. మారని గిరిజనుల బతుకులు!

ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది పాలకులు మారినా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని కృష్ణచైతన్య విమర్శించారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ వివిధ పార్టీల నాయకులు మాయమాటలతో గిరిజనుల ఓట్లు పొందుతున్నారే తప్ప, వారి సమస్యల పరిష్కారంపై ఏమాత్రం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కుక్కునూరు ఏజెన్సీలో నివసిస్తున్న వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల అర్హతలు ఉన్న గిరిజన విద్యావంతులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారులు లేవు.. విద్యుత్ సౌకర్యం లేదు!

నేటికీ వలస గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేక కాలిబాటలే ఆధారంగా మారాయని, విద్యుత్ సౌకర్యం లేక అనేక కుటుంబాలు చీకట్లోనే జీవనం సాగిస్తున్నాయని కృష్ణచైతన్య పేర్కొన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా అందని దయనీయ పరిస్థితుల్లో గిరిజనులు జీవిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు, మైసాక్షి వెంకటాచారి, కూరకుల బాబురావు, కోమాల్ల ఖాసి, ఉంగా, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఇది కద నిజం, యాదగిరిగుట్ట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని హర్యానా మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రివర్యులు బండారు దత్తాత్రేయ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఉప కార్యనిర్వాహణాధికారి స్వామివారి శేషవస్త్రాలు మరియు తీర్థప్రసాదాలను అందజేశారు.

రక్తదానం చేయండి -- ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడండి

స్టేషన్ ఘనపూర్,ఇది కద నిజం న్యూస్ అక్టోబర్ 25:

రక్తం మనిషి ప్రాణాలను నిలబెట్టే అమూల్యమైన జీవద్రవం అని స్టేషన్ ఘనపూర్ ఏసిపి భీం శర్మ అన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి, ప్రసవ సమయంలో రక్తం అవసరమయ్యే తల్లులకు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరం.మీరు చేసే ఒక్క యూనిట్ రక్తదానం ఒకరి ప్రాణాన్ని కాపాడవచ్చు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము. దానిని ఆరోగ్యవంతులైన మనుషులు మాత్రమే దానం చేయగలరు. కాబట్టి రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి, మానవత్వానికి ప్రతీకగా నిలుద్దాం.26 వ తేదీన ఉదయం 8.30 కు మా గార్డెన్స్, స్టేషన్ ఘన్‌పూర్ వద్ద నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి యువత, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ఇటువంటి కార్యక్రమాలలో యువత ఎక్కువ సంఖ్యలో హాజరు అయి మీ యొక్క స్ఫూర్తిదాయకతను ప్రదర్శించాలని ఏసిపి భీం శర్మ మరియు సి ఐ శ్రీనివాస్ కోరారు.

యాదాద్రికి పోటెత్తిన భక్తజనం

లక్ష్మీనరసింహుని దర్శనానికి గంటల సమయం







ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం, సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణమంతా సందడి నెలకొంది. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పెరిగిన రద్దీ కారణంగా ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పడగ ప్రత్యేక ప్రవేశ దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోవడానికి గంటన్నర సమయం పట్టింది. భక్తులు స్వామివారి ఆర్జిత సేవలు, నిత్య పూజల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. నిత్య కల్యాణం, లడ్డు ప్రసాదం కౌంటర్లు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపం వద్ద భక్తుల రద్దీ. అలాగే కొండ కింద ఉన్న కల్యాణ కట్ట, పుష్కరిణి వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలిరావడంతో కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డుతో పాటు పార్కింగ్ స్థలాల వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టారు.

ప్రజాసేవలో పోలీసుల పాత్ర అభినందనీయం

గీసుగొండ సీఐ విశ్వేశ్వర్‌కు నాయకుల జన్మదిన శుభాకాంక్షలు



వరంగల్, అక్టోబర్ 25 (ఇది కద నిజం):

గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ జన్మదినం సందర్భంగా వివిధ ప్రజాసంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అభినందనీయమని అన్నారు. పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటూ సేవలందించడం వల్ల సమాజంలో శాంతి, సామరస్యం పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఐక్య కార్యాచరణ సమితి వరంగల్ జిల్లా నాయకుడు సిలువేరు రవి, తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గీసుగొండ మండల అధ్యక్షుడు కొమ్ముల యోసేపు తదితరులు పాల్గొని సీఐ విశ్వేశ్వర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





ఆలేరులో అలైబలై వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి,ఆలేరు: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో 'బండ్రు ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'అలై బలై' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి నాయకత్వంలో నిర్వహించిన ఈ వేడుకకు హర్యానా మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రివర్యులు బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగువారి విశిష్ట సాంప్రదాయమైన అలైబలై సంస్కృతిని కాపాడుతూ, అన్ని రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ కొనియాడారు. పార్టీలకు అతీతంగా పరస్పర సోదరభావాన్ని, స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అలైబలై వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల అగ్రనేతలు విశేషంగా పాల్గొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, ప్రసిద్ధ గాయని విమలక్క, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణక్కలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

హైదర్‌గూడలో 'మన్ కీ బాత్' వీక్షించిన బిజెపి నేతలు

స్థానిక ఉత్పత్తులు, ప్రకృతి పరిరక్షణపై ప్రధాని పిలుపు



ఇది కద నిజం,హైదర్‌గూడ: హైదర్‌గూడ డివిజన్ శివనగర్ కాలనీలోని బూత్ నెంబర్ 239లో బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి నివాసంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 139వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా వీక్షించారు. మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయ్యాయని, సామాన్య ప్రజల శ్రమ, ధైర్యం, సేవా భావం మరియు విజయాలను దేశానికి పరిచయం చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు. పంజాబ్‌లో 'ఖేతీ విరాసత్ మిషన్' ద్వారా 'సవ్-త్రింజన్' కార్యక్రమంతో రసాయనాలు లేని సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తూ మహిళలకు చేనేతలో శిక్షణ ఇస్తున్న తీరును ప్రశంసించారు. అలాగే ఉత్తరాఖండ్‌లోని టెహ్రీ గఢ్వాల్ ప్రాంతంలో గ్రామస్థులు, అధికారులు కలిసి హేవల్ నదిని పునరుజ్జీవింపజేసిన విధానాన్ని, ఈశాన్య భారతంలో చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు ప్రాధాన్యతను వివరించారు. రాబోయే అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే 'రన్ ఫర్ యూనిటీ'లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజంలో స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం, ప్రకృతిని కాపాడుకోవడం, మన సంప్రదాయాలను నిలబెట్టుకోవడంతో పాటు భారతీయుల ప్రతిభను గుర్తించడమే ఈరోజు ప్రధాని ప్రసంగం యొక్క ముఖ్య సందేశమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఇన్చార్జ్ బొక్క బాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్, నాయకులు గోనె శ్రీకాంత్ రెడ్డి, పలుగు చెరువు నరేందర్, కాడెం మల్లేష్, భూపాల్ ముదిరాజ్, ఎన్. సోమనాథ్ రెడ్డి, మనోజ్, తరుణ్, విశాల్, శ్యామ్ బజాజ్, రామ్ చరణ్, కాకులారం కృష్ణ, కిట్టు, మహేష్ చారిలతో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై అండర్ పాస్‌లు నిర్మించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి: నేషనల్ హైవేపై నిత్యం జరుగుతున్న రహదారి ప్రమాదాల నివారణకు చిన్న కందుకూరు, పెద్ద కందుకూరు, బహుపేట, రామాజీపేట గ్రామాల వద్ద తక్షణమే అండర్ పాస్ రోడ్లు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్న కందుకూర్ స్టేజి వద్ద సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి దాటి గ్రామాలకు వెళ్లే క్రమంలో తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనివల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా మారిన ఈ గ్రామాల వద్ద అండర్ పాస్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య పాల్గొన్నారు. వీరితో పాటు యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మండల కార్యవర్గ సభ్యులు పేర బోయిన పెంటయ్య, పేర బోయిన బంగారి, నమిలే సంజీవయ్య, బొమ్మలరామారం మండల కార్యదర్శి అన్న బోయిన వెంకటేష్, చిన్న కందుకూర్ ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్, పల్లపు రవి, కల్లేపల్లి శ్రీశైలం, సుబ్బురు పర్వతాలు, రేఖల సాగర్, రేఖల మల్లు స్వామి, కాటం మల్లు స్వామి, వడ్లకొండ మల్లేష్, దొడ్డి మల్లయ్య, కొరుటూరి పాండు, సుబ్బురు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 26-10-2026



రుక్కు రుక్కు రుక్మిణి



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘అలియాస్ రుక్మిణి’ నిర్మాణ దశ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రాలకు కూడా మంచి స్పందన లభించింది. ఇందులో కృష్ణ అనే రచయిత పాత్రలో కనిపించనున్నారు నితిన్. తన భార్య రుక్మిణి పేరుతో ఆయన కథల్ని ఎందుకు రాస్తుంటారు? దానివెనకున్న కారణాలేమిటి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నాని సమర్పణలో ఆయన సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు.

డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్రంలోని ‘రుక్కు రుక్కు రుక్మిణి’ అనే తొలి గీతాన్ని ఈ నెల 27న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, రచన-దర్శకత్వం: మురళీకాంత్ దేవసోత్.

మళ్లీ థియేటర్లలోకి ‘కొబ్బరిమట్ట’!

బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు కథానాయకుడిగా నటించిన కామెడీ చిత్రం ‘కొబ్బరి మట్ట’ మరోసారి ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతోంది. పేరడీ కామెడీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమాను థియేటర్లలో తిరిగి విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. తాజాగా రీ రిలీజ్ తేదీని కూడా ప్రకటించింది. 2019 ఆగస్టు 10న థియేటర్లలో విడుదలైన ‘కొబ్బరి మట్ట’ ప్రేక్షకులను నవ్వించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌ను నవంబర్ 14న మరోసారి థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. ఈ వార్తతో సంపూర్ణేష్ బాబు అభిమానులు, కామెడీ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

అమృత ప్రొడక్షన్స్ పతాకంపై సాయి రాజేష్ నీలం ఈ చిత్రాన్ని నిర్మించారు. రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించారు. గతంలో సంపూర్ణేష్ బాబు హీరోగా నటించిన ‘హృదయ కాలేయం’ విజయవంతం కావడంతో, ఆ తర్వాత సాయి రాజేష్ నిర్మాతగా ‘కొబ్బరి మట్ట’ను రూపొందించారు. ఈ సినిమాలో సంపూర్ణేష్ బాబు మూడు విభిన్న పాత్రల్లో కనిపించారు. పాపారాయుడు, పెద్దరాయుడు, ఆంధ్రాయుడు పాత్రలతో తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా ఆయన నటన, హాస్య సన్నివేశాలు, డ్యాన్సులు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంపూర్ణేష్ బాబు సరసన ఇషికా సింగ్, గాయత్రి గుప్తా, షకీలా కథానాయికలుగా నటించగా, కత్తి మహేష్ కీలక పాత్ర పోషించారు. క్రమాన్ సంగీతం అందించారు.

‘కొబ్బరి మట్ట’ కథ పెద్దరాయుడు అనే వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. ముగ్గురు భార్యలు, నలుగురు తమ్ముళ్లు, ఎంతోమంది చెల్లెళ్లతో కూడిన పెద్ద ఉమ్మడి కుటుంబానికి పెద్దదిక్కుగా ఆయన ఉంటారు. కుటుంబ సభ్యులకే కాకుండా గ్రామ ప్రజలకు కూడా సహాయం చేస్తూ మంచి మనిషిగా పేరు సంపాదిస్తారు. అయితే, పెద్దరాయుడి పోలికలతో ఉన్న ఆంధ్రాయుడు వచ్చి తాను కూడా కుటుంబ వారసుడినని, ఆస్తిలో తనకు వాటా కావాలని డిమాండ్ చేయడంతో కథలో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఆ తర్వాత జరిగే సంఘటనలు, హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను నవ్విస్తాయి. ఇటీవల నాని నటించిన ‘ది ప్యారడైజ్’ సినిమాలో సంపూర్ణేష్ బాబు బిర్యానీ పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను మరోసారి పూర్తి స్థాయి కామెడీ పాత్రల్లో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నవంబర్ 14న ‘కొబ్బరి మట్ట’ రీ రిలీజ్ కానుండటంతో థియేటర్లలో మళ్లీ నవ్వుల సందడి నెలకొంటుందేమో చూడాలి.



తెలంగాణ ఉనికిని తగ్గించకండి!

టాలీవుడ్ యంగ్ హీరో ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా ‘ఇడుపు కాయితం’. వంశీరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను బన్నీ వాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 11న థియేటర్లలోకి రాబోతున్న ఈ మూవీ, మొదటి నుంచి పలు వివాదాల్లో చిక్కుకుంటూ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన ‘గడప’ పాటలోని కొన్ని సన్నివేశాలను ఉద్దేశించి సోషల్ మీడియాలో ట్రోలింగ్ భారీగా మొదలైంది. ఈ వివాదంపై జరుగుతున్న ట్రోలింగ్స్‌పై తాజాగా, దర్శకుడు వేణు ఊడుగుల చాలా ఘాటుగా స్పందించారు.



ట్విట్టర్ వేదికగా ఒక సంచలన పోస్ట్ పెడుతూ విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఒక సమాజ సంస్కృతిని కేవలం దాని పల్లెంలోనో లేదా గ్లాసుల్లోనో వెతక వద్దని, ఆ సమాజ చరిత్ర, పోరాటాలు, కళల్లో వెతకాలని ఆయన సూచించారు. తెలంగాణను తక్కువ చేసి మాట్లాడటం సులభమే కానీ, దానిని అర్థం చేసుకోవడానికి సంస్కృతిపై సరైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. మన జీవితాలను, సంస్కృతిని అత్యంత సహజంగా తెరపైకి తెస్తున్న ‘ఇడుపు కాయితం’ వంటి చిత్రాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. సినిమా చూశాక నచ్చకపోతే విమర్శించవచ్చని, అంతే తప్ప మీ అజ్ఞానంతో ఒక ప్రాంతం ఉనికిని తక్కువ చేసి చూడకండంటూ విమర్శకులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

ఓటీటీలోకి వచ్చేస్తున్న ‘తెల్లకాగితం’

‘కోర్ట్’ సినిమాతో భారీ విజయాన్ని అందుకొని ప్రేక్షకుల మనసు గెలుచుకున్న యంగ్ హీరో హర్షరోషన్, ఏమాత్రం గ్యాప్ తీసుకోకుండా వరుస సినిమాలతో అలరిస్తున్నారు. ఆ తర్వాత వచ్చిన ‘బ్యాండ్ మేళం’ బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయినా, ఏమాత్రం తగ్గేదేలే అంటూ ‘తెల్లకాగితం’ అనే యూత్‌ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నక్షత్ర హీరోయిన్‌గా నటించగా, కృష్ణ కొమ్మాలపాటి అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై దీనిని నిర్మించారు.

అజయ్, శరణ్య, దీపక్, గోపరాజు రమణ, రాజ్ కుమార్ కసిరెడ్డి కీలక పాత్రల్లో నటించి మెప్పించిన ఈ చిత్రం, పలు వాయిదాల తర్వాత అక్టోబర్ 2న థియేటర్లలోకి వచ్చింది. థియేటర్లలో మిశ్రమ స్పందన తెచ్చుకున్న ఈ మూవీ, నెలరోజులు కూడా కాకముందే ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రం డిజిటల్ హక్కులను సొంతం చేసుకున్న ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్, అక్టోబర్ 29 నుంచి ‘తెల్లకాగితం’ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ప్రేమ, బంధాలు, మనస్పర్ధలు, జీవితాన్ని మలుపు తిప్పే కీలక నిర్ణయాల చుట్టూ తిరిగే ఈ కథ, కుటుంబ సమేతంగా చూడదగ్గ ఎమోషనల్ డ్రామాగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అలరించబోతోంది.





నయనతారకు 60 అడుగుల కటౌట్!

లేడీ సూపర్ స్టార్ నయనతారకు తమిళనాడులో ఉన్న క్రేజ్ మరోసారి ప్రూవ్ అయింది. కోలీవుడ్‌లో కొందరు హీరోలతో సమానంగా ఆమెకు కూడా ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఉన్నట్లు తాజా ఇన్సిడెన్స్‌తో నిజం అయింది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం ‘మూకుత్తి అమ్మన్-2’.ఈ సినిమా కోసం ఏకంగా 60 అడుగుల భారీ కటౌట్‌ను తమిళనాడులోని ప్రముఖ ‘వేల్స్ థియేటర్స్’వద్ద ఏర్పాటు చేశారు. తమిళ సినీ చరిత్రలోనే ఒక హీరోయిన్‌కు ఈ స్థాయిలో కటౌట్ ఏర్పాటు చేయడం ఇదే మొట్టమొదటిసారి కావడం విశేషం.

ప్రస్తుతం ఈ కటౌట్‌కు సంబంధించిన ఫొటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతుండగా.. దీనిపై రెజీనా కసాండ్ర ఆనందం వ్యక్తం చేస్తూ ఓ పోస్ట్ షేర్ చేసింది. ‘ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది. తమిళనాడులో ఒక సినిమా విడుదలకు ముందు, ఇంత భారీ పరిమాణంలో కటౌట్ ఏర్పాటు చేయించుకున్న మొదటి నటి నయనతార. నిజంగా, 60 అడుగుల అద్భుతమైన ఘనత ఇది.. ఇది ఎంతో అభినందనీయం, నిజంగా ఆశ్చర్యపరిచే విషయం’ అంటూ తెలిపింది. కాగా.. బ్లాక్ బస్టర్ హిట్ ‘మూకుత్తి అమ్మన్’కు సీక్వెల్‌గా రాబోతున్నఈ మూవీని దర్శకుడు సుందర్ సి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా.. రెజీనా కాసాండ్రా, స్టార్ కమెడియన్ యోగిబాబు అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు.

సూర్యకు ‘కల్ట్’ టైటిల్ ఇవ్వని విశ్వక్!



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ ‘కల్ట్’ టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు.

అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.